AKSHARA TODAY

అక్షర టుడే

TOWARDS... TRUTH. TRUST. TREND

www.aksharatoday.in


## హైటెన్షన్ విద్యుత్ కనెక్షన్లకు 'సింగిల్ విండో' విధానం

**అక్షరటుడే,ఇందూరు:** విద్యుత్ వినియోగదారులకు పారదర్శకంగా సేవలందించేందుకు గాను.. హెచ్‌టీ సర్వీసులకు సింగిల్ విండో విధానాన్ని ప్రవేశపెడుతున్నట్లు టీజీఎన్పీడీసీఎల్ ఎస్ఈ రాజేశ్వర్ రావు పేర్కొన్నారు. ఈ మేరకు మంగళవారం ప్రకటన విడుదల చేశారు. 11 కేవీ, 33 కేవీ అంతకంటే ఎక్కువ వోల్టేజ్ కలిగిన కనెక్షన్ల పర్యవేక్షణ కోసం ప్రత్యేకంగా 'హెచ్‌టీ మానిటరింగ్ సెల్' కార్యాలయాలను ఏర్పాటు చేశామన్నారు. వినియోగదారులు ఇతర మార్గాల ద్వారా కాకుండా, కేవలం టీజీ ఎన్పీడీసీఎల్ అధికారిక పోర్టల్ ద్వారా మాత్రమే దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుందని పేర్కొన్నారు. దరఖాస్తు చేయగానే ఒక ప్రత్యేక గుర్తింపు సంఖ్య లభిస్తుందని, దీని ద్వారా దరఖాస్తు ఏ దశలో ఉందో వినియోగదారులు ఇంటి నుంచే తెలుసుకోవచ్చన్నారు.



## రోడ్డుపై ధాన్యం బస్తాలు తగలబెట్టి నిరసన



**అక్షరటుడే, ఎల్లారెడ్డి:** మండలంలోని హాజీపూర్ తండాలో ధాన్యం కొనుగోలు కేంద్రానికి లారీలు రాకపోవడంతో రైతులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. రహదారిపై ధాన్యం బస్తాలను మంగళవారం తగులబెట్టి ధర్నాకు దిగారు. కొనుగోలు కేంద్రంలో కాంటాలు పూర్తయి దాదాపు నెల కావస్తున్నా లారీల రాకపోవడంతో ధాన్యం ఎక్కడికక్కడే పడి ఉందని అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేశారు. పంట పండించడం కంటే విక్రయించడమే కష్టంగా మారిందని వారు కన్నీటి పర్యంతమయ్యారు. ఒకపక్క వర్షాలు కురుస్తుండడంతో ఆరుగాలం శ్రమించి పండించిన ధాన్యం తడిసి ముద్ద అవుతోందని, దానిని మళ్లీ ఆరబెట్టేందుకు కూలీల ఖర్చు తడిసి మోపెడవుతోందని వాపోయారు. అటు లారీలు రాక ధాన్యం తరలకపోవడంతో కేంద్రం వద్దే రాత్రింబవళ్లు పడిగాపులు కాయాల్సి వస్తోందన్నారు. ధాన్యాన్ని కాపాడుకునేందుకు, తరలించేందుకు అదనంగా డబ్బులు ఖర్చు చేసి అప్పుల ఊబిలో కూరుకుపోతున్నామని ఆవేదన చెందారు. రైతులు రోడ్డుపై బైఠాయించి రాస్తారోకో చేపట్టడంతో భారీగా ట్రాఫిక్ స్తంభించిపోయింది. విషయం తెలుసుకున్న తహశీల్దార్ ప్రేమ్ కుమార్, ఎస్సై రాజు, రెవెన్యూ సిబ్బందితో హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకొని రైతులను సముదాయించారు. వారం రోజుల్లోగా ఉన్న ధాన్యం మొత్తాన్ని తరలించేలా చర్యలు తీసుకుంటామని, వెంటనే లారీలను ఏర్పాటు చేసి ధాన్యాన్ని రైస్ మిల్లులకు చేరవేస్తామని రైతులకు హామీ ఇచ్చారు. తహశీల్దార్ హామీతో రైతులు శాంతించి ఆందోళన విరమించారు. జిల్లా యంత్రాంగం వెంటనే స్పందించి లారీల సమస్యను శాశ్వతంగా పరిష్కరించాలని, రైతులకు న్యాయం చేయాలని రైతు సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. లేనిపక్షంలో పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు.

# బల్దియాలో విధులా! బాబోయ్

కామారెడ్డి మున్సిపాలిటీలో విధుల్లో చేరడానికి అధికారులు, ఉద్యోగులు భయ పడుతున్నారు. అయ్య బాబోయ్.. కామారెడ్డి మున్సిపాలిటీనా అంటున్నారు. సెలవు పెట్టి ఇంట్లో అయినా కూర్చుంటాం కానీ అక్కడికి మాత్రం వెళ్లలేం అనుకుంటున్నారు. ఇక్కడి రాజకీయాలు అధికారులకు తలనొప్పిగా మారుతున్నాయన్న టాక్ వినిపిస్తోంది. ఈ క్రమంలో పాలనపై నీలినీడలు అలుముకుంటున్నాయి.

- అక్షరటుడే, కామారెడ్డి



- కామారెడ్డిలో డ్యూటీ అంటే భయపడుతున్న అధికారులు
- అధికారుల మెడకు ప్రొటోకాల్ రగడ
- సెలవుపై వెళ్లిన మున్సిపల్ కమిషనర్
- మళ్లీ వచ్చేది అనుమానమే

కామారెడ్డి మున్సిపాలిటీలో ప్రొటోకాల్ రగడ, ఆధిపత్య పోరులో అధికారులు నలిగిపోతున్నారు. తాజాగా మొదలైన ఎమ్మెల్యే వర్సెస్ ఛైర్‌పర్సన్ ప్రొటోకాల్ వివాదం రోజురోజుకు ముదురుతుందన్న చర్చ సాగుతోంది. ఈ వివాదంలో ఎవరి మాట వినాలో తెలియని సందిగ్ధంలో అధికారులు మిన్నకుండిపోతున్నారు. ఎటు తేల్చుకోలేక చివరికి బలి అవుతున్నారన్న టాక్ వినిపిస్తోంది.

### కమిషనర్‌కు అక్షింతలు..

ఛైర్‌పర్సన్ వ్యాఖ్యల తర్వాత మున్సిపల్ వర్గాల్లో జోరుగా చర్చ జరుగుతోంది. ఈ విషయమై కమిషనర్‌కు గట్టిగానే అక్షింతలు పడ్డాయని సమాచారం. ప్రొటోకాల్ ఉల్లంఘించారంటూ నాయకులు ఆయనపై మండిపడ్డారని సమాచారం. ఈ పరిణామాల నేపథ్యంలోనే కమిషనర్ హుటాహుటిన సెలవుపై వెళ్లిపోవడం గమనార్హం. వ్యక్తిగత కారణాలు అని చెబుతున్నా, ఈ రగడే అసలు కారణమని ఉద్యోగులు చర్చించుకుంటున్నారు. ఆయన మళ్లీ వచ్చే అవకాశంపై కూడా అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

### చిచ్చు రేపిన సమీక్ష

ఇటీవల ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మున్సిపల్ అధికారులతో నిర్వహించిన సమీక్ష బల్దియాలో చిచ్చు రేపింది. మున్సిపల్ కమిషనర్‌తో పాటు పలువురు అధికారులతో ఎమ్మెల్యే సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశంపై మున్సిపల్ ఛైర్‌పర్సన్ ఘాటుగా స్పందించారు. మున్సిపల్ అధికారులతో సమీక్షించే అధికారం ఎమ్మెల్యేకు లేదన్నారు. కౌన్సిల్ తీర్మానం లేకుండా, తన అనుమతి లేకుండా అధికారులు క్యాంపు ఆఫీస్‌కు ఎలా వెళ్తారు? సమావేశానికి వెళ్లిన అధికారుల నుంచి వివరణ కోరతాను అంటూ బహిరంగంగానే హెచ్చరించారు.

### తెరపడేనా..

ఎన్నికల తర్వాత ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ, ఎమ్మెల్యే వెంకట రమణారెడ్డి మధ్య కొద్దికాలం ప్రొటోకాల్ రగడ కొనసాగింది. ప్రస్తుతం ఇది ఎమ్మెల్యే వర్సెస్ ఛైర్‌పర్సన్గా మారింది. దాంతో ఇద్దరు నాయకుల మధ్య ఆధిపత్య పోరుకు తెరపడి, ప్రొటోకాల్ వివాదానికి స్పష్టమైన ముగింపు లభించకపోతే కామారెడ్డి మున్సిపల్ పాలన మరింత కుంటుపడటం ఖాయమనే చర్చ సాగుతోంది. ఇరువురి మధ్య నష్టపోయేది చివరకు సామాన్య ప్రజలేనని రాజకీయ వర్గాల్లో చర్చ సాగుతోంది. మరి ఈ ప్రొటోకాల్ పంచాయతీకి ఫుల్‌స్టాప్ ఎప్పుడు పడుతుందో చూడాలి.

### భయంభయంగా విధులు..

కామారెడ్డి మున్సిపాలిటీలో పని చేయాలనుకునే అధికారుల నిర్ణయం సాహసోపేతమని చెప్పుకోవాలి. ఇక్కడి రాజకీయాలను తట్టుకుని నిలబడాలంటే అంత ఆషామాషీ కాదన్న టాక్ ఉంది. కరవమంటే కప్పకు కోపం.. వదలమంటే పాముకు కోపం అన్నట్టుగా ఇక్కడి అధికారుల పరిస్థితి ఉంటుందని తెలుస్తోంది. గత కమిషనర్ చెప్పినట్టు వినడం లేదని కౌన్సిల్ సభ్యులు ఏకంగా సరెండర్ తీర్మానం చేసిన విషయం తెలిసిందే. ప్రస్తుత కమిషనర్ ఎమ్మెల్యే రివ్యూ మీటింగుకు వెళ్లడంపై సైతం ఛైర్‌పర్సన్ ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో కామారెడ్డిలో ఎవరి మాట వినాలో.. ఎవరి మాట కాదనాలో తెలియని పరిస్థితి నెలకొంది.



## చెరువులను కబ్జా చేస్తే చర్యలు తప్పవు

**అక్షరటుడే, డిచ్‌పల్లి:** నిజామాబాద్ రూరల్ నియోజకవర్గంలో నల్లమట్టి తవ్వకాల పేరిట చెరువు శిఖం భూములను కబ్జా చేస్తే చట్టపరమైన చర్యలు తప్పవని ఎమ్మెల్యే డాక్టర్ ఆర్.భూపతి రెడ్డి అన్నారు. ఈ మేరకు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. నల్లమట్టి తరలింపు పేరుతో కొంతమంది దానిని దుర్వినియోగం చేస్తున్నారని ఎమ్మెల్యే అన్నారు. చెరువు శిఖం భూములను కబ్జా చేయాలని చూస్తున్నారని పేర్కొన్నారు. అలాంటి వారిపై రెవెన్యూ, ఇరిగేషన్, మైనింగ్ తదితర శాఖల నిఘా ఉంటుందని స్పష్టం చేశారు. చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని, కేసులు నమోదు చేయబడతాయన్నారు. ఎవరు కూడా చట్టాన్ని ఉల్లంఘించి పనులు చేయవద్దన్నారు. ఈ మేరకు సంబంధిత రెవెన్యూ, ఇరిగేషన్, మైనింగ్, పోలీసు, శాఖల అధికారులకు నిరంతర పర్యవేక్షణ పెంచాలని ఆదేశించారు.



## రేపు ఎస్ఐఆర్‌పై బీఆర్ఎస్ సన్నాహక సమావేశం

**అక్షరటుడే, ఆర్మూర్:** పట్టణంలో ఎస్ఐఆర్‌పై బీఆర్ఎస్ నాయకులకు బుధవారం సన్నాహక సమావేశం నిర్వహించనున్నారు. ఈ మేరకు ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి ప్రకటన విడుదల చేశారు. స్థానిక క్షత్రియ కల్యాణ మండపంలో ఎస్ఐఆర్‌పై అవగాహన, బీఆర్ఎస్ పార్టీ సభ్యత్వ నమోదు సన్నాహక సమావేశం నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమానికి ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డి, వీజీ గౌడ్, కేఆర్ సురేష్‌రెడ్డి, బాజిరెడ్డి గోవర్ధన్ తదితరులు హాజరు కానున్నారని తెలిపారు. ఆర్మూర్ నియోజకవర్గ బూత్ అధ్యక్షులు, ముఖ్య నాయకులు తప్పక హాజరు కావాలని ఆయన కోరారు.

## విదేశీ వాణిజ్యాన్ని అందిపుచ్చుకునేలా తోడ్పాటు అందించాలి

**అక్షరటుడే, నిజామాబాద్ సిటీ:** వ్యవసాయమే ప్రధాన ఆధారంగా ఉన్న జిల్లా రైతాంగానికి మరింత ప్రయోజనం కలిగేలా వాణిజ్య, పరిశ్రమల మంత్రిత్వ శాఖ ద్వారా తోడ్పాటు అందించాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి కోరారు. కలెక్టరేట్‌లో మంగళవారం వాణిజ్య, పరిశ్రమల మంత్రిత్వ శాఖ (డీజీఎఫ్టీ), ఏపీఈడీఏ, జాతీయ పసుపు బోర్డు, నాబార్డు, ఇండియా పోస్టల సంయుక్త ఆధ్వర్యంలో మెగా ఎగుమతి ప్రోత్సాహక కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఈ-కామర్స్ ఎగుమతుల ప్రదర్శన, ట్రేడ్ కనెక్ట్ పోర్టల్, పసుపు, వరి, సోయాబీన్, మొక్కజొన్న, పత్తి తదితర పంటల మార్కెట్ వైవిధ్యీకరణ అంశాలపై అధికారులు రైతులకు అవగాహన కల్పించారు. నాణ్యమైన, అధిక దిగుబడులను అందించే పంటల సాగు, సస్య రక్షణ చర్యలు, పంట ఉత్పత్తుల మార్కెటింగ్, విదేశాలకు ఎగుమతులు, ఎరువులు, క్రిమిసంహారక మందుల వాడకం, సాగు నీటి యాజమాన్య పద్ధతులు తదితర అంశాల గురించి వివరిస్తూ, రైతుల సందేహాలను నివృత్తి చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ ఇలా త్రిపాఠి మాట్లాడుతూ.. జిల్లా రైతాంగం సేద్యం రంగంలో ఆధునిక విధానాలు, శాస్త్రీయ పద్ధతులను అవలంభిస్తూ ఆదర్శ రైతులుగా పేరు పొందారన్నారు. ముఖ్యంగా ఆర్మూర్ ప్రాంత రైతులు అత్యధిక విస్తీర్ణంలో పసుపు సాగు చేస్తారని, వ్యవసాయ ఉత్పత్తులు, నూతన వంగడాల విషయంలో అంకాపూర్ ప్రాంత రైతులు అందరికీ ఆదర్శంగా నిలుస్తున్నారని గుర్తు చేశారు. ఈ నేపథ్యంలో జిల్లా రైతాంగానికి ఆధునిక పద్ధతులలో




పంటల సాగుపై అవగాహన కల్పిస్తూ, విదేశీ వాణిజ్యంతో అనుసంధానం కలిగిస్తే ఈ ప్రాంత రైతులకు మరింత ప్రయోజనం చేకూరుతుందని కలెక్టర్ ఆకాంక్షించారు. పురాతన, సంప్రదాయ పద్ధతుల స్థానంలో ఆధునిక సాగు విధానాలను తెలియజేయడం, కూలీల కొరతను అధిగమించేందుకు వీలుగా యంత్రీకరణను వినియోగించడంపై దృష్టి సారించాలని కోరారు. కార్యక్రమంలో జాతీయ పసుపు బోర్డు అధికారులు కేవీఎస్ శైలజ, ప్రత్యూష్, వ్యవసాయ విశ్వవిద్యాలయం ప్రొఫెసర్లు విద్య, జనార్ధన్ రెడ్డి, ఏపీఈడీఏ అధికారి నాయుడు, నాబార్డు డీజీఎం ఎస్ ప్రవీణ్ కుమార్, పరిశ్రమల కేంద్రం జిల్లా మేనేజర్ సురేష్ కుమార్, జిల్లా ఉద్యానశాఖ అధికారి శ్రీనివాస్, వివిధ శాఖల అధికారులు, రైతులు, ట్రేడర్లు పాల్గొన్నారు.

## ఆర్మూర్ బల్దియాలో ముగ్గురు అధికారుల బదిలీ..?

**అక్షరటుడే, ఆర్మూర్:** ఆర్మూర్ మున్సిపల్ కార్యాలయంలో ఒకేసారి ముగ్గురు అధికారులు బదిలీ అయినట్లు తెలుస్తోంది. ఈ నెలాఖరులోగా బదిలీ అయిన మున్సిపాలిటీల్లో వారు రిపోర్ట్ చేయనున్నట్లు సమాచారం.




సీనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్న శేఖర్ బోధన్ మున్సిపాలిటీకి బదిలీ కాన్నారని.. మరో సీనియర్ అసిస్టెంట్ అబ్దుల్ సలీం మెట్‌పల్లి బల్దియాకు ట్రాన్స్‌ఫర్ అయ్యే అవకాశం ఉంది. అలాగే రెవెన్యూ సెక్షన్‌లో డిప్యుటేషన్‌పై పనిచేస్తున్న ఆర్ఐ అక్షయ్ కోరుట్ల మున్సిపాలిటీ బదిలీ అయినట్లు తెలుస్తోంది. అయితే బదిలీ ఉత్తర్వులు త్వరలో వెలువడనున్నట్లు సమాచారం. ఆయా ఉద్యోగులు ఉత్వరులు వెలువడిన అనంతరం బదిలీ అయిన కార్యాలయాల్లో రిపోర్ట్ చేయనున్నట్లు తెలుస్తోంది.



## చిన్నారుల ప్రతిభా ప్రదర్శనకు బాల్‌భవన్ చక్కని వేదిక

**అక్షరటుడే, నిజామాబాద్ అర్బన్:** చిన్నారుల ప్రతిభా ప్రదర్శనకు బాల్‌భవన్ చక్కని వేదిక అని డీఈవో అశోక్ అన్నారు. జిల్లా కేంద్రంలోని బాల్‌భవన్‌లో మంగళవారం వేసవి శిక్షణ తరగతుల్లో భాగంగా ఏర్పాటు చేసిన వివిధ రకాల ప్రదర్శన కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చిన్నారుల్లో అపారమైన ప్రతిభ ఉంటుందని.. దానిని వెలికితీసేందుకు సరైన వేదికలు అవసరమన్నారు. వేసవి సెలవులను వృథా చేయకుండా వివిధ రకాల ప్రదర్శనలకు బాల్‌భవన్ చక్కటి వేదికగా మారిందన్నారు. చిన్నారులు ఆయా ప్రదర్శనల్లో చూపిస్తున్న ప్రతిభ చూస్తే ముచ్చటేస్తుందన్నారు. అలాగే బాల్‌భవన్ ఫౌండర్ నారాయణ సింహాచలం వారసులు మామిడిపూడి ప్రేమలత మాట్లాడుతూ.. చిన్నారుల ప్రతిభ అద్భుతమన్నారు. కార్యక్రమంలో బాల్‌భవన్ సూపరింటెండెంట్ మల్లాది ఉమాబాల, పూర్వ బాల్‌భవన్ సూపరింటెండెంట్ విఠల్, ప్రభాకర్, పుష్పలత, వెంకటలక్ష్మి, నటరాజ్, శ్వేత, సోనాలి, రిచా, మాధవి, నవీన్, రాం చందర్, గణేష్, మాధవి, విజయ పాల్గొన్నారు.

## తెలంగాణలో బీఆర్ఎస్ పనైపోయింది: మహేష్ కుమార్ గౌడ్

**అక్షరటుడే, కామారెడ్డి:** తెలంగాణ రాష్ట్రంలో బీఆర్ఎస్ పనైపోయిందని, బీజేపీ వచ్చే అవకాశమే లేదని టీపీసీసీ అధ్యక్షుడు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ అన్నారు. కామారెడ్డి పట్టణంలోని క్రిస్టల్ ప్యాలెస్‌లో మంగళవారం డీసీసీ నూతన కమిటీ ప్రమాణస్వీకారం కార్యక్రమంలో పాల్గొన్నారు. నూతనంగా నియమించబడిన కమిటీ సభ్యులకు, కాంగ్రెస్ మండల అధ్యక్షులకు నియామకపత్రాలు అందజేసి వారితో ప్రమాణస్వీకారం చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీలో ఏ చిన్న పదవి అయినా అది భవిష్యత్తుకు పునాది అని.. ఆ పదవికి న్యాయం చేస్తేనే భవిష్యత్తు ఉంటుందని పీసీసీ చీఫ్ అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో అన్ని వర్గాలకు న్యాయం చేకూరుతుందని తెలిపారు. ఉచిత బస్సు నుంచి మొదలుకుని సన్నబియ్యం పంపిణీ వరకు తెలంగాణ పథకాలు ఏ రాష్ట్రంలో అమలు కావడం లేదన్నారు. సీఎం రేవంత్ రెడ్డి విజన్‌తో రాష్ట్రానికి రూ.6 లక్షల కోట్ల విదేశీ పెట్టుబడులు వచ్చాయన్నారు. దేశంలోనే మొట్టమొదటిసారిగా కులగణన చేసిన ఏకైక రాష్ట్రం తెలంగాణ అని, యావత్ దేశానికి తెలంగాణ రోల్ మోడల్ అని తెలిపారు. కులగణనలో బీసీలను చేర్చవద్దన్న మోదీకి సుప్రీంకోర్టు మొట్టికాయలు వేసిందన్నారు. వరి వేస్తే ఉరే అని చెప్పిన విషయాన్ని బీఆర్ఎస్ మర్చిపోయిందన్నారు. కల్లాల మీద రైతులు చనిపోయిన విషయాన్ని గుర్తు చేశారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కేవలం 50 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం మాత్రమే కొంటామని అంటోందని, 75 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనడానికి రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు.





## కొనుగోలు కేంద్రాల గడువును వారంపాటు పొడిగించాలి

**అక్షరటుడే, బోధన్:** నవీపేట్ మండలంలోని కొన్ని గ్రామాల్లో కొనుగోలు కేంద్రాల గడువును వారం పాటు పొడిగించాలని బినోల సొసైటీ ఛైర్మన్ మగ్గరి హన్మాండ్లు కోరారు. ఈ మేరకు నవీపేట తహ శీల్దార్ వెంకటరమణకు మంగళవారం వినతిపత్రం అందజేశారు. నవీపేట్ మండలం బినోల ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం పరిధిలోని దాదాపు అన్ని గ్రామాల్లో మా సొసైటీ ద్వార వడ్లను కొనుగోలు చేయడం ముగిసిందన్నారు. అయితే నాళేశ్వర్ గ్రామంలో చెరువు ఆయకట్టు భూములు, వరి పంటను చివరి దశలో నాటడం.. అలాగే ఎస్సారెస్పీ ముంపు ప్రాంతాల్లో నీళ్లు వచ్చి చేరడంతో నాట్లు ఆలస్యమయ్యాయన్నారు. దీంతో పంట ఆలస్యంగా వచ్చిందని.. మరో వారం రోజులపాటు కేంద్రం కొనసాగితే ధాన్యం పూర్తిగా విక్ర యించుకుంటామన్నారు. కార్యక్రమంలో చిన్నదోడ్డి ప్రవీణ్, ఆశిష్ తదితరులు పాల్గొన్నారు.

## పెట్రో ధరలను పెంచడాన్ని నిరసిస్తూ కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం..



**అక్షరటుడే, ఆర్మూర్:** పెట్రో ధరలను పెంచడాన్ని నిరసిస్తూ సీపీఎం ఆర్మూర్ డివిజన్ కమిటీ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఈ మేరకు పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలో కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా సీపీఎం ఆర్మూర్ డివిజన్ కార్యద ర్శి పల్లపు వెంకటేష్, పట్టణ కార్యదర్శి కుతాడి ఎల్లయ్య మాట్లా డుతూ.. కేంద్ర ప్రభుత్వం గత పది రోజుల్లోనే పెట్రోల్, డీజిల్ ధరలు నాలుగు సార్లు పెంచి సామాన్య ప్రజలపై భారం మోపడం సిగ్గుచేట న్నారు. ఐదు రాష్ట్రాల ఎన్నికలకు ముందు పెట్రోల్ డీజిల్ ధరలు పెం చబోమని ప్రగల్బాలు పలికి ఎన్నికల అయిపోగానే సామాన్య ప్రజలపై బాణాలు వేసి పేదల నడ్డి విరుస్తున్నారన్నారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు భూమన్న, రవి, ఓంకార్, సాయిలు, శ్రావణ్ కుమార్, వడ్డెన్న, లక్ష్మణ్, స్వప్న తదితరులు పాల్గొన్నారు.

## పచ్చిరొట్ట విధానంతో పంటకు పోషకాలు



**అక్షరటుడే, లింగంపేట:** మండలంలోని నల్లమడుగు, లింగంపేట, శెట్టిపల్లి సంగారెడ్డి సొసైటీలో మంగళవారం జీలుగ విత్తనాలను పంపిణీ చేసినట్లు ఏవో అనిల్ కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పచ్చిరొట్ట విధానంతో రైతులకు పంటల్లో అనేక పోషకాలు లభిస్తాయన్నారు. శెట్‌పల్లి సంగారెడ్డి సొసైటీకి 250, నల్లమడుగు సొసైటీకి 250, లింగంపేట సొసైటీకి 333 బస్తాలు వచ్చినట్లు తెలిపారు. 50 శాతం సబ్సిడీతో రూ 2452.50 చెల్లించిన రైతులకు బస్తాలు అందజేసినట్లు పేర్కొన్నారు. కార్యక్ర మంలో నల్లమడుగు సొసైటీ ఛైర్మన్ రమేష్ బాణాపూర్ తండా సర్పంచ్ పీర్ సింగ్, నల్లమడుగు సర్పంచ్ తదితరులు పాల్గొన్నారు.



ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం విధివిధానాలు దాదాపుగా ఖరారయ్యాయి. తెల్ల రేషన్ కార్డు ఉన్న ప్రతి కుటుంబానికి రూ.5 లక్షల జీవిత బీమా వర్తింపజేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. కుటుంబ పెద్ద మరణిస్తే 10 రోజుల్లోనే నామినీ ఖాతాలోకి డబ్బు జమ చేసేలా నిబంధనలు రూపొందిస్తున్నారు. దీంతో కొన్ని లక్షల కుటుంబాలకు లబ్ధి చేకూరనుంది. – అక్షరటుడే, ఆర్మూర్

# ఇందిరమ్మ బీమాతో పేదలకు భరోసా..

రాష్ట్రంలో కొత్త పథకం అమలైతే లక్షల కుటుంబాలకు బీమా భద్రత లభించనుంది. ముఖ్యంగా వ్యవసాయ కూలీలు, బీడీ కార్మికులు, వలస కార్మిక కుటుంబాలు అధికంగా ఉన్న ఆర్మూర్, బాల్కొండ, బోధన్, నిజామాబాద్ అర్బన్, నిజామాబాద్ రూరల్, కామారెడ్డి, బాన్సువాడ, ఎల్లారెడ్డి, జుక్కల్ నియోజకవర్గాల్లోని పేదలకు ఇది పెద్ద భరోసా కానుంది. రోజువారీ కూలీతో బతికే వారి ఇంటి పెద్దకు ఏమైనా అయితే కుటుంబం రోడ్డునపడేది. ఈ బీమా వస్తే ఆ భయం ఉండదని పలువురు వర్షం వ్యక్తం చేస్తున్నారు.

### అమలు అయ్యేది ఇలా..

నమోదు ప్రక్రియ వచ్చే నెల నుంచి గ్రామ/వార్డు సచివాలయ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు ఇంటింటికీ వెళ్లి కుటుంబ యజమాని, నామినీ వివరాలు, బ్యాంకు ఖాతా, ఆధార్ వివరాలు సేకరిస్తారు. పూర్తి ప్రీమియంను రాష్ట్ర ప్రభుత్వమే చెల్లిస్తుంది. లబ్ధిదారులు ఒక్క రూపాయి కూడా కట్టాల్సిన అవసరం లేదు.

క్లెయిమ్ ప్రక్రియ సహజ మరణం, ప్రమాదవశాత్తు మరణం రెండింటికీ వర్తిస్తుంది. మరణ ధ్రువీకరణ పత్రం, రేషన్ కార్డు, నామినీ బ్యాంకు వివరాలు సమర్పిస్తే 10 పనిదినాల్లోనే ఖాతాలో రూ.5 లక్షలు జమ అవుతాయి. 18 నుంచి 60 ఏళ్లలోపు ఉన్న కుటుంబ యజమాని పేరుతో బీమా వర్తిస్తుంది.

- రేషన్ కార్డు ఉన్న ప్రతి కుటుంబానికి వర్తింపు
- 10 రోజుల్లోనే ఖాతాలోకి రూ.5 లక్షలు
- ఉమ్మడి జిల్లాలో లక్షల కుటుంబాలకు లబ్ధి

### జూన్ 2న విధివిధానాలు..

తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా జూన్ 2న సీఎం పూర్తి విధివిధానాలను విడుదల చేసే అవకాశం ఉందని అధికార వర్గాలు తెలిపాయి. అదే రోజు నుంచి రాష్ట్రవ్యాప్తంగా సభ్యత్వ నమోదు ప్రారంభం కానుంది.

కేంద్ర ప్రభుత్వ పీఎం జీవన్ జ్యోతి బీమా కేవలం రూ.2లక్షలు మాత్రమే. కానీ ఇందిరమ్మ బీమా రూ.5 లక్షలు కావడంతో పేదలకు నిజమైన భరోసా దక్కనుంది.

### ముందస్తు జాగ్రత్తలు..

అధికారులు వచ్చినప్పుడు రేషన్ కార్డు, ఆధార్, బ్యాంకు పాస్‌బుక్, కుటుంబ సభ్యుల ఫొటోలు సిద్ధంగా ఉంచుకోవాల్సి ఉంటుంది. నామినీ పేరును కచ్చితంగా నమోదు చేయించుకోవాలి. 2024 - 25 అంచనాల ప్రకారం.. నిజామాబాద్ జిల్లాలో.. తెల్ల రేషన్ కార్డుదారులు 5,21,480 ఉండగా.. 18.5 లక్షల మంది లబ్ధిదారులు ఉన్నారు. అలాగే కామారెడ్డి జిల్లాలో తెల్ల రేషన్ కార్డులు 3,68,250 ఉండగా 12.9 లక్షల మంది లబ్ధిదారులు ఉన్నారు. మొత్తం రెండు జిల్లాల్లో 8.9 లక్షల తెల్ల రేషన్ కార్డులు, 31.4 లక్షల మందికి ఈ పథకం ద్వారా త్వరలో లబ్ధి చేకూరనుంది.

## బీజేవైఎం రాష్ట్ర కోశాధికారిగా అమంద్ విజయ్ కృష్ణ



**అక్షరటుడే, నిజామాబాద్ సిటీ:** తెలంగాణ బీజేవైఎం (యువమోర్చా) రాష్ట్ర కమిటీలో నిజామాబాద్ జిల్లాకు చెందిన సీనియర్ నాయకుడు అమంద్ విజయ్ కృష్ణకు కీలక బాధ్యతలు దక్కాయి. ఆయనను రాష్ట్ర కోశాధికారిగా నియమిస్తూ పార్టీ నాయకత్వం నిర్ణయం తీసుకుంది. గత 15 ఏళ్లుగా పార్టీకి అంకితభావంతో సేవలు అందిస్తూ.. డివిజన్ కార్యద ర్శి స్థాయి నుంచి రాష్ట్ర కోశాధికారిగా ఎదిగిన విజయ్ కృష్ణ నియామకం పై కార్యకర్తలు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా అమంద్ విజయ్ కృష్ణ మాట్లాడుతూ.. నాపై నమ్మకంతో ఈ బాధ్యతను అప్పగించిన బీజేపీ రాష్ట్ర నాయకత్వానికి, ఎంపీ ధర్మపురి అర్వింద్‌కు, జిల్లా ప్రజాప్రతినిధుల కు, సీనియర్ నాయకులకు కృతజ్ఞతలు తెలియజేస్తున్నానన్నారు.

## ఎల్లారెడ్డిలో జీలుగ విత్తనాల పంపిణీ ప్రారంభం



**అక్షరటుడే, ఎల్లారెడ్డి:** ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌కు గాను రైతులకు అవసరమైన జీలుగ విత్త నాలను మండలంలోని రైతులకు అంద జేసేందుకు వ్యవసాయ శాఖ చర్యలు చేప ట్టింది. ఇందులో భాగంగా మంగళవారం స్థానిక సొసైటీ కార్యాలయంలో పీఏసీ అధ్యక్షుడు ఏగుల నరసింహులు పంపిణీని ప్రారంభించారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయ అధికారిణి శోభ మాట్లాడుతూ.. 30 కిలోల జీలుగ బస్తా ధర రూ.4,905 కాగా, సబ్సిడీపై రైతులు కేవలం రూ.2,452.50 మాత్రమే అందిస్తున్నామన్నారు. ఒక బస్తా రెండున్నర ఎకరా లకు సరిపోతుందన్నారు. జీలుగు విత్తనాలు అవసరమున్న రైతులు తమ పట్టా పాస్ బుక్, ఆధార్ కార్డు జిరాక్స్ తీసుకొని రైతు వేదికలకు వెళ్లి పర్మిట్లు రాయించుకోవా లని సూచించారు. ఎల్లారెడ్డి, గండిమాసాని పేట క్లస్టర్ రైతులకు మీసాన్ పల్లి రైతు వేదికలో, జంగమాయపల్లి క్లస్టర్ రైతు లకు బ్రాహ్మణపల్లి రైతు వేదికలో, అన్నాసాగర్ క్లస్టర్ పరిధిలోని రైతులకు ఆజామాబాద్ రైతు వేదికలో విత్తనాల పంపిణీ జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో డైరెక్టర్ మర్రి సూర్య ప్రకాష్ , లంబాడి లక్ష్మణ్ , చిన్నంగారి సుఖేందర్ రెడ్డి , నాగం గోపికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## తాగి వాహనం నడిపిన వ్యక్తికి ఏడురోజుల జైలు

**అక్షరటుడే, నిజామాబాద్ అర్బన్:** మద్యం సేవించి వాహనం నడిపిన ఓ వ్యక్తికి న్యాయ స్థానం ఏడురోజుల జైలుశిక్ష విధించింది. ఈ మేరకు నిజామాబాద్ రూరల్ పోలీస్ స్టేషన్ ఎస్‌హెచ్‌వో వివరాలు తెలిపారు. నిజామాబా ద్ రూరల్ శివారులో పోలీసులు డ్రంకన్ డ్రైవ్ తనిఖీలు నిర్వహిస్తుండగా తోట పోశిబాబు అనే వ్యక్తి మద్యం తాగి వాహనం నడుపుతు న్నట్లుగా గుర్తించి అతడికి కౌన్సెలింగ్ నిర్వ హించారు. అనంతరం కోర్టులో హాజరుపర్చగా అతడికి న్యాయమూర్తి ఏడురో జుల జైలుశిక్ష విధించారు.

## మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి



**అక్షరటుడే, ఆర్మూర్:** యువత మత్తు పదార్థాల కు దూరంగా ఉండాలని ఆర్మూర్ ఎస్‌హెచ్‌వో సత్యనారాయణ గౌడ్ అన్నారు. 'మన కాలనీ.. మన భద్రత.. మన బాధ్యత' కార్యక్రమాన్ని మం గళవారం పట్టణంలోని 12వ వార్డులో నిర్వ హించారు. ఈ సందర్భంగా ఎస్‌హెచ్‌వో మా ట్లాడుతూ.. ట్రాఫిక్ నియమ, నిబంధనలను పాటిస్తూ వాహనాలు నడపాలన్నారు. సైబర్ నేరాలు, సీసీ కెమెరాలపై అవగాహన కల్పించా రు. కార్యక్రమంలో స్థానిక కౌన్సిలర్ నాగేంద్ర, సాయినాథ్, సత్యనారాయణ పాల్గొన్నారు.



## మహిళా భవన నిర్మాణ పనులకు భూమిపూజ

**అక్షరటుడే, ముప్కాల్:** ఎన్ఆర్ఈజీఏ కింద మంజూరైన నూతన మహిళా భవన నిర్మాణ పనులకు గ్రామంలో మంగళవారం భూమి పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పం చ్ మహేష్ యాదవ్ మాట్లాడుతూ మహిళా సంఘాల సమావేశాలు, శిక్షణ కార్యక్రమాలు, ఇతర సామాజిక కార్యక్రమాలకు ఈ భవనం ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ సునీత భరత్ రాజు, పంచాయతీ పాలకవర్గ సభ్యులు, గ్రామ పెద్దలు, మహిళా సంఘాల అధ్యక్షులు పాల్గొన్నారు.



## ప్లాస్టిక్ రహిత గ్రామంగా తీర్చిదిద్దేందుకు కృషి

**అక్షరటుడే, లింగంపేట:** మండలంలోని శెట్‌పల్లి గ్రామాన్ని ప్లాస్టిక్ రహిత గ్రామంగా తీర్చిది ద్దేందుకు కృషి చేస్తున్నామని సర్పంచ్ అట్టెం శ్రీనివాస్ పేర్కొన్నారు. గ్రామంలో మంగళవా రం సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. ప్లా స్టిక్‌తో జరిగే అనర్థాలను వివరించారు. అనం తరం గ్రామస్థులకు ప్లాస్టిక్ డబ్బాలు వాడవద్దని అవగాహన కల్పిస్తూ ప్రతి ఒక్కరికి స్టీల్ టిఫిన్ బాక్సులను పంపిణీ చేశారు. గ్రామంలోని హోట ళ్లలో ప్లాస్టిక్ గ్లాసులను వినియోగించవద్దని హోటల్ యజమానులకు గాజు గ్లాసులను అం దజేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో నరేష్, ఉపసర్పంచ్ బాలయ్య, వార్డు సభ్యులు, గ్రామ స్థులు పాల్గొన్నారు.

## ప్రేమించిన అమ్మాయి సోదరుల దాడి.. మనస్తాపంతో యువకుడి ఆత్మహత్య




**అక్షరటుడే, కామారెడ్డి:** ప్రేమించిన యువతి సోదరులు దాడి చేశారనే మనస్తాపంతో ఓ యువ కుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన కామారెడ్డి పట్టణంలో సోమవారం రాత్రి చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని ఎస్సీ కాలనీకి చెందిన ధ్రువ కుమార్(19) అదే కాలనీకి చెందిన ఓ అమ్మాయిని మూడేళ్లుగా ప్రేమిస్తున్నాడు. ఈ విషయం అమ్మాయి సోదరులకు తెలిసింది. దీంతో ధ్రువకుమార్‌ను వారు దూషిస్తూ దాడికి పాల్ప డ్డారు. దాంతో మనస్తాపానికి గురైన ధ్రువకుమార్ ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి సోదరుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టా మని పోలీసులు తెలిపారు.

## వెల్లుట్లపేటలో హోరాహోరీగా క్రికెట్ టోర్నీ

**అక్షరటుడే, ఎల్లారెడ్డి:** ఎల్లారెడ్డి మండలం వెల్లుట్లపేట గ్రామంలో 'వెల్లుట్ల పేట క్రికెట్ సీజన్-1' టోర్నీ హోరీగా నిర్వహిస్తున్నారు. ఎమ్మెల్యే మదన్ మోహన్ రావు సూచన మేరకు సర్పంచ్ కొయ్యల వినోద్ రాజా గౌడ్, ఉప సర్పంచ్ కర్రెచెవుల రాజు యాదవ్ ఆధ్వర్యంలో పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ.. గ్రామీణ యువతలో దాగి ఉన్న క్రీడా ప్రతిభను వెలికితీసేందుకు ఇలాంటి పోటీలు ఎంతో ఉపయోగప డతాయన్నారు. టోర్నీలో వెల్లుట్లపేట, వెల్లుట్ల, వెంకటాపూర్, వెల్లుట్ల తండా ప్రాంతాల నుంచి మొత్తం ఏడు జట్లు పాల్గొని తలపడ్డాయి. ప్రతి ఏడాది యువతలో క్రీడాస్ఫూర్తిని పెంచేందుకు టోర్నీలు నిర్వహిస్తామని నిర్వాహకులు తెలిపారు. ఫైనల్ మ్యాచ్‌లో అద్భుత ప్రతిభ కనబర్చిన కర్ణం అజయ్‌కు 'మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్' అవార్డు అందజేశారు.



## రైలు ఢీకొని గొర్లు మృతి..

**అక్షరటుడే, కామారెడ్డి:** రైలు ఢీకొని గొర్లు మృతి చెందాయి. ఈ ఘటన కామారెడ్డి మున్సిపాలిటీ పరి ధిలోని అడ్లూర్‌లో మంగళవారం చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన కుర్మ ఆరెల్లి లక్ష్మి తన గొర్రెల మందను తీసుకుని ప్రతిరోజు మాదిరిగానే గ్రామ శివారులో మేపడానికి వెళ్లింది. కామారెడ్డి నుంచి నిజామాబాద్ వైపు రైలు వెళ్తుండగా శబ్దానికి గొర్రెలు బెదిరాయి. ఈ క్రమంలో సుమారు 19 గొర్లు రైలు కింద పడి మృతి చెందాయి. దీంతో బాధిత రైతుకు సుమారు రూ. లక్షన్నర వరకు ఆస్తి నష్టం కలిగింది. ప్రభుత్వం బాధిత రైతును ఆదుకోవాలని గ్రామస్థులు కోరారు.

## జనగణనను అత్యంత జాగ్రత్తగా నిర్వహించాలి

**అక్షరటుడే, బాల్కొండ:** జనగణన-2027 కార్యక్రమాన్ని కచ్చితత్వంతో నిర్వహిం చాలని అడిషనల్ ఛార్జ్ ఆఫీసర్, మండల విద్యాశాఖ అధికారి బట్టు రాజేశ్వర్ సూచించారు. బుధవారం బాల్కొండ మండల కేంద్రంలోని కేఎస్ఆర్ కాలనీ ఎన్టీఆర్ కాలనీ, బస్సాపూర్ గ్రామాల్లో జరుగుతున్న ఇళ్ల గణన ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎన్యూమరేటర్లు రాజ్‌కుమార్, రమాదేవి నిర్వహిస్తున్న గణన విధా నాన్ని పరిశీలించి పలు సూచనలు చేశారు. ఎండల తీవ్రత ఎక్కువగా ఉన్నందున ఉదయం వేళల్లో గణన చేపట్టాలని, ఇంటి యజమానులకు ముందస్తుగా సమాచారం ఇస్తే వారు అందుబాటులో ఉంటారని తెలిపారు. పంచాయతీ కార్యదర్శులు సంబంధిత అధికారులతో సమన్వయం చేసుకుంటూ ప్రక్రియను నిర్వహించాలని సూచించారు. ఎన్యూమరేటర్లు, సూపర్‌వైజర్లు సమయపాలన పాటిస్తూ ఎలాంటి పొరపాట్లు లేకుండా గణన పూర్తిచేయాలని సందేహాల నివృత్తి కోసం ప్రత్యేక వాట్సాప్ గ్రూప్ ఏర్పాటు చేస్తామని వెల్లడించారు.

